## క్లుప్తంగా

### ఆదిత్యుని సన్నిధిలో ఎంపీ జీవీఎల్


ఎంపీకి జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

**అరసవల్లి/గార:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని బీజేపీ ఎంపీ(రాజ్యసభ) జి.వి.ఎల్. నర్సింహారావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అధికార సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈయనతో పాటు వచ్చిన తాడేపల్లిగూడెం మున్సిపల్ మాజీ చైర్మన్ గమిని సుబ్బారావు జన్మదినం సందర్భంగా ఆదిత్యుని సన్నిధిలోనే సుబ్బారావు దంపతులకు ఎంపీ సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కూర్మనాథాలయాన్ని దర్శించారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని తెలియజేయగా, ఈవో గుత్తి గురునాథం ప్రసాదం అందజేశారు.

### వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

**జి.సిగడాం:** మండలంలోని జాడ గ్రామానికి చెందిన సచివాలయ కన్వీనర్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు కోరాడ అచ్చెరావుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఆయన్ను మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు, చందక సతీష్, చిక్కాల ధర్మారావు, మాధవరావు, ఇజ్జి కోటి, పెద్ది లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

### 'బీజేపీతోనే సామాజిక సాధికారత'

**ఎచ్చెర్ల క్యాంపస్:** బీజేపీతోనే సామాజిక సాధికారిత సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఎచ్చెర్లలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో మాధవ్ రెండోసారి విజయం సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.ఈశ్వరరావు, పైడి వేణుగోపాలం, సంపత రావు నాగేశ్వరరావు, తమ్మినేని గోవిందరావు, వావిలపల్లి చంద్రరావు పాల్గొన్నారు.

### 'ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తున్నారు'

**ఎచ్చెర్ల క్యాంపస్:** రాష్ట్రంలో ప్రతిపక్షాలు గొంతునొక్కేలా పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి కేసులు నమోదు చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు ఆరోపించారు. ఎచ్చెర్లలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి, గన్నవరం ఘటనలు అప్రజాస్వామికమని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు గాలి వెంకటరెడ్డి, పైడి ముఖలింగం పాల్గొన్నారు.

### ఎరువుల నిల్వల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

**జి.సిగడాం :** రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయాధికారి వై.శారద అన్నారు. మంగళవారం పెంట, జి.సిగడాం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల గొడౌన్ వద్ద రైతులకు సలహాలు, సూచనలు తెలిపే బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు పైడిచింతల కుసుమ, సింహాద్రి విజయ్‌శంకర్, సుజనకళ పాల్గొన్నారు.

### నవధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వాలి


భగీరథపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

**ఎచ్చెర్ల క్యాంపస్:** రైతులు నవధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి పి.రేవతి అన్నారు. భగీరథపురంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 'నవధాన్యాలు సాగు-నేల తల్లి బాగు' అన్న నినాదంతో గ్రామంలో రైతులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగుకు ముందుగా 30 రకాలు విత్తనాలు వేసి 40 నుంచి 45 రోజుల వరకు ఉంచాలన్నారు. ఈ విధానం వల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. నేల సారవంతమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ధనలక్ష్మి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

# మాతృభాషలోనే మాధుర్యం


శ్రీకాకుళం కల్చరల్: సభలో మాట్లాడుతున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు


శ్రీకాకుళం కల్చరల్: వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న తెరవే ప్రతినిధులు


శ్రీకాకుళం కల్చరల్: అష్టావధాని పైడి హరనాథ రావును సత్కరిస్తున్న భాషాభిమానులు


జి.సిగడాం: అద్వానంపేట(శ్రీరాంపురం) హెచ్ఎం అరుణకుమారి, సీతమ్మల ఆధ్వర్యంలో సంప్రదాయ వస్త్రధారణతో హాజరైన విద్యార్థులు

- అమ్మభాషతోనే అనుబంధాలు
- మాతృభాషా దినోత్సవంలో వక్తలు

**శ్రీకాకుళం కల్చరల్:** అమ్మభాషలోనే కమ్మదనం ఉంటుందని, ప్రతిఒక్కరూ మాతృభాషలోనే మాట్లాడాలని వక్తలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో మంగళవారం తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాష గొప్పదనాన్ని వివరించారు. విశ్రాంత సీఈఓ సురంగి మోహనరావు మాట్లాడుతూ మాతృభాషలోనే అందరూ మాట్లాడాలని కోరారు. అనంతరం తెరవే అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.ఉపేంద్రశర్మ, బి.జగన్నాథం, కె.సూర్యనారాయణ, ప్రసాద్, సంతోష్‌కుమార్, టి.కృష్ణమూర్తి తమ కవితలు చదివి వినిపించారు. విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

**భాష భవిష్యత్తు యువత చేతుల్లోనే..**

**శ్రీకాకుళం కల్చరల్:** మాతృభాషను బతికిస్తూ ఇతర భాషలు నేర్చుకునేందుకు విద్యార్థులు అభ్యుదయ భావాలతో ముందుకు రావాలని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు పిలుపునిచ్చారు. అరసం, ఇస్కాఫ్, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా సాంస్కృతిక వైవిధ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తెలుగును బతికించడంలో సాహిత్యం గొప్పపాత్ర పోషిస్తుందన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ తెలుగు భాష ఎన్నటికీ సజీవంగానే ఉంటుందని చెప్పారు. మాతృభాషతోనే బంధాలు, బాంధవ్యాలు పెరుగుతాయని అన్నారు. జీవనం సాగించడానికి ఇంగ్లీషు భాష నేర్చుకోవచ్చని, అయితే మాతృభాషను మరువకూడదని చెప్పారు. అనంతరం కవితా రచన, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో అరసం ఉపాధ్యక్షులు జ్యోతిఫెడ్రిక్, ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు, మహిళా కళాశాల తెలుగు విభాగాధిపతి మరడాన శ్రీనివాసరావు, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.శంకరనారాయణ, ఇస్కాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.మల్లేశ్వరరావు, బి.శ్రీరామమూర్తి, చింతాడ కృష్ణారావు, ఎస్.ఈశ్వరరావు, కూన పాపారావు, డాక్టర్ కె.గిరిజ, డాక్టర్ కె జ్యోతిలక్ష్మి, ఎస్.పద్మావతి, ఎస్.రుద్రమరాణి, కవయిత్రి పత్తి సుమతి తదితరులు పాల్గొన్నారు.

**తల్లిలాంటిది తెలుగు భాష..**

**జి.సిగడాం:** తెలుగు భాష తల్లి వంటిదని, అటువంటి భాష అంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఏపీటీఎఫ్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మక్క గంగేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెలుగు భాష మాధుర్యాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పేకల రమేష్, ఉపాధ్యాయులు వల్లూరు రమణ, సతీష్, కోటి, పద్మావతి పాల్గొన్నారు.

**తెలుగుభాష మన వారసత్వ సంపద**

**శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం అర్బన్:** తెలుగు భాష మన వారసత్వ సంపదని, మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యతని ప్రముఖ అష్టావధాని పైడి హరనాథరావు అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా పలువురు భాషాభిమానులు మంగళవారం హరనాథరావును ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరభాషను నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదన్నారు. టూరిజం అధికారి ఎస్.నారాయణరావు మాట్లాడుతూ తెలుగు భాష మాధుర్యం మరువలేనిదన్నారు. ప్రముఖ వ్యాఖ్యాత, సామాజిక కార్యకర్త వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ శతశాతం పద ప్రయోగానికి తన వ్యాఖ్యాన సమయంలో ప్రాధాన్యత నిచ్చానని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, భట్లు, పి.రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

**అమ్మలాంటి తియ్యనైనది మాతృభాష**

**శ్రీకాకుళం న్యూకాలనీ:** అమ్మలాంటి తియ్యనైనది మాతృభాషని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ అన్నారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ పప్పల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతు మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ ఎ.మోహన్‌రాజు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ శాంతి దేవి, బీఆర్ఏయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిన్నారావు, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ పైడితల్లి, తెలుగు విభాగం అధ్యాపకులు నారాయణరావు, కామర్స్ విభాగాధిపతి హెచ్ లక్ష్మీపతి, రామ్మూర్తి, డాక్టర్ శ్రీనివాస పాత్రో, డాక్టర్ ప్రమీల, అరుణకుమారి, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల:** ముద్దాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు మణిపాత్రుని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్యాలు వినిపించారు. మాతృభాషా మాధుర్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి, పద్మజ, గణపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**మధుర భాష తెలుగు**

**లావేరు:** తెలుగు భాష మధురమైనదని లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు గ్రంథాలయంలో మాతృ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలిమ, బాలరాజు, గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


జి.సిగడాం: తెలుగు భాష ఆవశ్యకతను వివరిస్తున్న ఉపాధ్యాయులు


లావేరు : తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు


శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

## పట్టభద్రులకు వాస్తవాలు వివరించాలి

- సంపూర్ణ మెజారిటీతో గెలిపించాలి
- ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్. చిత్రంలో ఎమ్మెల్యే కిరణ్ తదితరులు

**రణస్థలం:** ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పట్టభద్రులంతా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి సంపూర్ణ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కోరారు. రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్సీ ఎన్నికపై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వచ్చే నెల 13న ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 6302 మంది పట్టభద్రులు ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ప్రతి ఓటరుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న మంచిని వివరిస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు తనకే వేసేలా చూడాలన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క కియో కంపెనీ మాత్రమే పెట్టారని చెప్పారు. మన ప్రభుత్వంలో విశాఖలోని అచ్యుతాపురంలో టైర్ల పరిశ్రమ, ఈవోయూ ఎక్స్‌పోర్టు అండ్ ఇంపోర్టు పరిశ్రమ, ఏషియన్ పెయింట్స్ కంపెనీ, కాస్టిక్ సోడా పరిశ్రమ, కోరుకొండ ఏపీఐఐసీలో టెక్ మహేంద్ర యూనిట్ ద్వారా విత్తనాల పరిశ్రమ, కడపలో అతిపెద్ద ప్లై ఉడ్ కంపెనీ, శ్రీ సిటీలో గ్లోస్టార్ ఏసీ కంపెనీ తదితర పరిశ్రమలు నెలకొల్పారని, వీటిని ఎల్లోమీడియాలో రాయరని చెప్పారు. ఈ వాస్తవమంతా ప్రజలకు, ఉన్నత విద్యావంతులకు తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం, లావేరు, జి.సిగడాం జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, మహంతి పెదరామునాయుడు, దన్నాన రాజినాయుడు, జరుగుళ్ల శంకరరావు, బూరాడ వెంకటరమణ, మీసాల శ్రీనివాసరావు, మూగి శ్రీరాములు, డోల వెంకటరమణతో పాటు వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### బీసీల పక్షపాతి సీఎం జగన్

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** శాసన మండలిలో 18 ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 14 మందికి అవకాశం కల్పించడం చారిత్రక సామాజిక విప్లవానికి నాంది అని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్ ఆవిష్కరించిన సామాజిక మహా విప్లవంలో దీన్ని మేలి మలుపుగా సామాజికవేత్తలు అభివర్ణిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఈ స్థాయిలో బడుగు, బలహీనవర్గాలకు అవకాశం కల్పించిన దాఖలాలు లేవన్నారు. దేశంలో సామాజిక న్యాయం నినాదంతో అధికారంలోకి వచ్చిన సీఎంల జాబితాల్లో జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాజ్యసభలో ఐదుగురికి, మంత్రివర్గంలో కూడా బీసీలకు సముచిత స్థానం కల్పించడం హర్షనీయమన్నారు. బీసీగర్జన, మహాసంకల్ప పాదయాత్ర, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక సమీకరణాల ప్రాతిపదికన పదవులు అందించి బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, బ్యాక్ బోన్ అని మరోసారి రుజువు చేశారని గుర్తు చేశారు. మండలిలో అధికార పార్టీ బలం 44కు పెరగనుందన్నారు. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే 30 మంది ఉన్నారని, మండలిలో వైఎస్సార్సీపీ సభ్యుల్లో ఆయా వర్గాలకు 68.18 శాతం ప్రాతినిధ్యం కల్పించిన గొప్ప దార్శనికుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

### తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్ బాగు చేస్తున్న సిబ్బంది

**లావేరు:** కొత్తకుంకాంలో మంచినీటి పథకం పైపులైన్‌కు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల పైపులైన్ పాడవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కె.నీలయ్య, సచివాలయం కన్వీనర్ దొండపాటి వాసు మంగళవారం మెకానిక్‌లను రప్పించి పాడైన చోట మంచినీటి పైపులైన్ బాగు చేయించారు. వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని కార్యదర్శి తెలిపారు.

### డ్రైవర్లకు ఆహ్వానం


మాట్లాడుతున్న డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.శర్మ

**శ్రీకాకుళం అర్బన్:** ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో దినసరి వేతనంపై తాత్కాలికంగా పనిచేసేందుకు హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.శర్మ తెలిపారు. డిపోలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల బస్సులు నడిపేందుకు హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు కావాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 18 నెలల అనుభవం కలిగిన ఒరిజినల్ హెవీ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, 10వ తరగతి సర్టిఫికెట్ తీసుకుని శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వర్మ, 2వ డిపో డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, కార్యాలయ సిబ్బంది జీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి పెద్దపీట


నర్తు రామారావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

**రణస్థలం:** సీఎం జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, బీసీలంతా ముఖ్యమంత్రికి మద్దతుగా నిలవాలని స్థానిక సంస్థల శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు అన్నారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ముందుగా రామారావు, చామంతి దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నాడు బీసీలకు చంద్రబాబు మొండిచేయి చూపిస్తే నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి బీసీల్లో అధిక శాతం జనాభా ఉన్న యాదవులను గుర్తించి ఎమ్మెల్సీ కేటాయించడం గర్వంగా ఉందన్నారు.

అనంతరం ఎమ్మెల్యే కిరణ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామారావును సీఎం జగన్ ఎంపిక చేయడం గొప్ప విషయమని, బీసీలంతా ఆయనకు రుణపడి ఉంటామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం, లావేరు, జి.సిగడాం జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, మహంతి పెదరామునాయుడు, దన్నాన రాజినాయుడు, జరుగుళ్ల శంకరరావు, బూరాడ వెంకటరమణ, మీసాల శ్రీనివాసరావు, మూగి శ్రీరాములు, డోల వెంకటరమణ, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, లుకలాపు శ్రీనివాసరావు, మీసాల రాంబాబు, తోలేటి వెంకటరావు, ఆబోతుల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## స్టార్‌వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గమిదే

**శ్రీకాకుళం అర్బన్:** ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రతిష్టాత్మకమైన స్టార్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగింది. స్టార్‌వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కౌన్సిలర్-1 కూన వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో 2023-24 సంవత్సరానికి గాను క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా శాసపు జోగినాయుడు, కార్యదర్శిగా గోలీ సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షునిగా సింహాద్రి వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.నారాయణరావు, కోశాధికారిగా బి.దేవీప్రసాద్, గౌరవ అధ్యక్షునిగా జి.ఇందిరా ప్రసాద్, డైరెక్టర్లుగా కూన వెంకటరమణమూర్తి, రత్నాల వరప్రసాద్, బి.వి.రవిశంకర్, పి.జి.గుప్తా, ఎస్.సంజీవరావు, చలపాక సూర్యారావు, గొర్లె వాసుదేవరావు, ఊన్న కామేశ్వరరావు, గురు ఆనందరావు, గుడ్ల జగ్గారావు, మెట్ట దనుంజయబట్లు, శాసపు అప్పలనాయుడు, బొడ్డేపల్లి ప్రసాదరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ

**శ్రీకాకుళం న్యూకాలనీ:** శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 15 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జాబ్ మేళాకు 63 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా రాత పరీక్షకు 47 మందిని ఎంపికచేశారు. మౌఖిక పరీక్షల అనంతరం 15 మందిని ఎంపిక చేసినట్టు జేకేసీ సమన్వయకర్త, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.పైడితల్లి వెల్లడించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త సీహెచ్ శాంతిదేవి, నియామక ప్రతినిధులు శేషగిరిరావు, స్వాతి, తేజ, జేకేసీ మెంటార్లు దామోదరరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

### విద్యార్థులకు హిందీ ప్రతిభా పరీక్షలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జాతీయ భాష హిందీపై ఆసక్తిని పెంచేందుకు హిందీ ప్రతిభా పోటీలు దోహదపడతాయని విశ్రాంత డీఈవో, హిందీ మంచ్ జోనల్ సలహాదారు బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. హిందీ మంచ్ సంస్థ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీలో న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా హైస్కూల్ స్థాయి విద్యార్థులకు హిందీ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల ద్వారా హిందీ పట్ల భయాన్ని దూరం చేయవచ్చున్నారు. హిందీ మంచ్ జిల్లా అధ్యక్షుడు దొంతం పార్వతీశం మాట్లాడుతూ పోటీలను ముందు ముందు జిల్లా అంతటా నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో పి.శ్రీకీర్తి, ఎస్.ఎల్ చేతన్, ఎల్.గిరిష్మాలు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు, హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, ఎన్‌సీఎస్ డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, రిటైర్డ్ హెడ్మాస్టర్ ముంగిపూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### జూనియర్ బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా అంకమ్మ చౌదరి


అంకమ్మ చౌదరి

**శ్రీకాకుళం న్యూకాలనీ:** వచ్చే నెలలో జరిగే రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీల్లో పాల్గొనే భారత జూనియర్ బాడ్మింటన్ బృందానికి మేనేజర్‌గా డాక్టర్ పి.అంకమ్మ చౌదరి నియమితులు కావడం పట్ల శ్రీకాకుళం జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ హర్షం వ్యక్తంచేసింది. మార్చి 1 నుంచి 5 వరకు నెదర్లాండ్స్‌లో జరిగే ప్రతిష్టాత్మక యోనెక్స్ డచ్ జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు-2023తోపాటు బెర్లిన్‌లో మార్చి 8 నుంచి 12 వరకు జరిగే యోనెక్స్ జర్మన్ జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు-2023లలో పాల్గొనే భారత షట్లర్స్ బృందానికి ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి, బీఏఐ సంయుక్త కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి మేనేజర్‌గా నియమితులయ్యారు. ఇది రాష్ట్రానికి లభించిన గౌరవమని, జిల్లా తరఫున అభినందనలు తెలుపుతున్నట్టు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఆర్.రాజేంద్రన్, అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈఓ సంపతిరావు సూరిబాబు, బి.దామోదర్, జి.ప్రసాద్, శైలానీ, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

### భూముల సర్వేకు సహకరించాలి

**లావేరు:** మండలంలోని పోతయ్యవలసలో సమగ్ర భూముల సర్వేలో భాగంగా మంగళవారం గ్రౌండ్ వేలిడేషన్ నిర్వహించారు. తొలుత వీఆర్వోలు, సచివాలయాల సర్వేయర్ల రైతుల సమక్షంలో సమగ్ర భూముల సర్వే చేపట్టారు. రైతుల నుంచి అభ్యంతరాలు, సరిచేయడం కోసం గ్రామంలో సచివాలయాల సర్వేయర్లు ప్రకాష్, తేజలు గ్రౌండ్ వేలిడేషన్ నిర్వహించి వివరాలు సేకరించారు.